**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభా' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

ఫోన్ - 8985829417

# సూర్య ప్రభా

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 2 సంచిక: 1 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | గురువారం, జూన్ 26 2025 | పేజీలు : 4




# "బనకచర్ల" బెంబేలు..

## తెలంగాణలో సవాళ్ల రాజకీయం!

హైదరాబాద్ : తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి భారీ సవాల్ రువ్వారు. "నీ ఇష్టం. నీకు నచ్చిన రోజు రెడీగా. అసెంబ్లీ పెడతం. గోదావరి జలాలపై నువ్వు ఏం చేశావో.. మేం ఏం చేశామో.. చర్చిద్దాం" అని సవాల్ రువ్వారు. కేసీఆర్.. చర్చకు వస్తవా?! అని నిలదీశారు.

ప్రస్తుతం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య గోదావరి జలాల వ్యవహారం రాజకీయ రచ్చ రేపుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ ఎస్ నాయకులు.. రేవంత్ రెడ్డి సర్కారుపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. తన గురువు, ఏపీ సీఎం చంద్రబాబుకు మేలు చేస్తున్నాడని.. బీఆర్ ఎస్ కీలక నాయకులు విమ ర్శిస్తున్నారు. ముఖ్యంగా ఏపీలోని కర్నూలు జిల్లాలో నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణలోను, ఇటు రెండు రాష్ట్రాల్లోనూ రాజకీయంగా తీవ్ర వివాదం అయింది. బనక చర్ల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఏపీ తరలించుకుని పోయేందు కు రెడీ అయిందని.. అయినా రేవంత్ రెడ్డి ప్రభుత్వంనిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, కవిత, కేటీఆర్ సహా ఇతర నేతలు ఆరోపిస్తున్నారు. గోదావరి జలాలను తామే రక్షించామని చెప్పుకొచ్చారు.

మరోవైపు.. ఏపీ సీఎం చంద్రబాబు రెండు రాష్ట్రాలూ కూర్చుని చర్చించుకుంటే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి కూడా దాదాపు ఓకే చెప్పారు. అయితే.. ఇంతలోనే బీఆర్ ఎస్ నాయకులు గోదావరి జలాలపై లాలూచీ వ్యవహారం చేసేందుకే గురు శిష్యులు ప్రయత్నిస్తున్నారంటూ.. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులపై విమర్శలు చేశారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి తాజాగా స్పందిస్తూ.. గోదావరి జలాల విషయంలో చర్చించేందుకు కేసీఆర్ ముందుకు రావాలని సవాల్ రువ్వారు. ఆయన చెప్పిన రోజే.. అసెంబ్లీ నిర్వహించేందుకు తాము సిద్దంగా ఉన్నామన్నారు. ఈ మేరకు స్పీకర్‌కు లేఖరాయాలని ఆయన సూచించారు. అవసరమైతే.. ఒక్కరోజు కాదు.. ఎన్ని రోజులైనా ఈ విషయంపై చర్చిద్దామని చెప్పారు. మరి దీనిపై బీఆర్ ఎస్ నాయకులు ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి.




దిల్లీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ముగ్గురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, పీయూష్ గోయల్, శ్రీపాద యశోనాయక్‌లను కలిసిన శ్రీధర్‌బాబు.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన భూముల అంశంపై చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని కోరారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2పై కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రధాని, కేంద్రమంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో మెట్రోకు అనుమతి వస్తుందని భావించామన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

## ఎమర్జెన్సీ పాలన దేశానికి మాయని మచ్చ: కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్: ఎమర్జెన్సీ పాలన చీకటి అధ్యాయం.. దేశానికి మాయని మచ్చ అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఎమర్జెన్సీ ప్రకటించి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా .. నాటి పరిస్థితులపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రజాస్వామ్యానికి పాతరేసి, నియంతృత్వం రాజ్యమేలిన రోజు. దేశమంతా అధికార దాహమనే చీకటితో నిండిన రోజు. స్వాతంత్ర్యాన్ని కాలరాసి, రాక్షసత్వం రాజ్యమేలిన రోజు. వ్యక్తి స్వేచ్ఛకు సమాధి కట్టి రాజ్యాంగాన్ని పరిహసించిన రోజు కాంగ్రెస్ పార్టీ విధించిన ఎమర్జెన్సీ. భారతదేశ చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిల్చిన దుర్దినం. ఎమర్జెన్సీని ఎత్తివేసేందుకు పాటుపడి, రాజ్యాంగ విలువలను కాపాడానికి జైళ్లలో మగ్గిన ఎందరో మహనీయుల సేవలను స్మరించుకుంటూ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడదాం" అని బండి సంజయ్ పేర్కొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డికి టోనీ బ్లెయిర్ లేఖ..
## తెలంగాణ రైజింగ్ 2047కు ప్రశంస

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ లేఖ రాశారు. తెలంగాణ రైజింగ్-2047ను ప్రశంసించారు. ఇటీవల దిల్లీ పర్యటన సందర్భంగా టోనీ బ్లెయిర్‌తో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రైజింగ్ విజన్ 2047గురించి ఆయనకు వివరించిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఐటీ, ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో లక్ష్యాల గురించి ఆయనతో చర్చించారు. ఈ నేపథ్యంలో టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్, తెలంగాణ మధ్య అవగాహన ఒప్పందం కుదరగా.. రైజింగ్ విజన్ రూపకల్పన, అమలుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను ఇరువైపుల ప్రతినిధులు మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రైజింగ్ 2047 తనను ఆకట్టుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డిని అభినందించిన టోనీ బ్లెయిర్.. ఈ విజన్‌కు సహకరిస్తామని తెలిపారు.



## బోనాలకు వేళాయె.. నేటి నుంచి గోల్కొండ కోటలో ఉత్సవాలు ప్రారంభం

**- శ్రీజగదాంబిక అమ్మవారికి తొలి బోనం - తెలంగాణలో నెల రోజులపాటు బోనాల జాతరే**

హైదరాబాద్ : ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలను అధికారిక పండుగగా ప్రకటించినది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లో ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేసింది.

**కులీకుతుబ్‌షా కాలం నుంచే...** గోల్కొంట కోటలో బోనాలు మొదట ప్రారంభించే సంప్రదాయం కులీకుతుబ్‌షా కాలం నుంచి వస్తుంది. అప్పట్లో కులీకుతుబ్‌షా నిర్వహించగా, నేడు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తుంది. బోనాలు ఉత్సవాలకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీజగదాంభిక ట్రస్టు బోర్డు ఏర్పాట్లు మొదలుపెట్టింది.

**నెలరోజుల జాతర...** గురువారం నుంచి జూలై 24వతేదీ వరకు తెలంగాణలో బోనాల జాతర జరుగనుంది. నెలరోజుల పాటు ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఈ పూజలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. వీరికోసం గోల్కొండ కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయాలు, బాడిగార్డ్స్ లైన్స్ ప్రాంతాలు సిద్ధం చేస్తున్నారు.

# సర్పంచ్ ఎన్నికలకు వేళైంది..

## టైం సెట్ చేసిన హైకోర్టు..

# ఎన్నికల వేడి షురూ!




హైదరాబాద్ : స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల నిర్వహిస్తామని అనేక సందర్భాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇక బీసీలకు రిజర్వేషన్లు కూడా కేటాయిస్తామని వెల్లడించింది. బిసీల రిజర్వేషన్ల విషయంలో అనేక న్యాయపరమైన సమస్యలో ఉన్న నేపథ్యంలో.. ప్రభుత్వం కాస్త వెనుకడుగు వేసినట్టు తెలుస్తోంది. ఇటీవల బీసీల రిజర్వేషన్లకు సంబంధించి శాసనసభలో ప్రభుత్వం ఒక తీర్మానాన్ని రూపొందించి కేంద్రానికి పంపించింది. అయితే ఆ తీర్మానాన్ని కేంద్రం ఇంకా ఆమోదించలేదని తెలుస్తోంది. కేంద్రం ఆమోదించిన తర్వాత అది రాష్ట్రపతి పరిధిలోకి వెళ్తుంది. రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఆ బిల్లుకు మోక్షం లభిస్తుంది. అయితే బీసీలు కేవలం తెలంగాణలో మాత్రమే లేరు కాబట్టి.. పైగా రిజర్వేషన్ల అంశం అనేది కేంద్ర పరిధిలోది కాబట్టి.. దీనిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడంలో ప్రభుత్వం ఆశించినత స్థాయిలో ఆసక్తి చూపించకపోవడంతో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం రంగంలోకి దిగింది. ఇప్పటికే స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి అనేక పిటిషన్లు వెళ్లాయి. ఆ పిటిషన్లను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కీలక తీర్పు వెల్లడించింది. సెప్టెంబర్ 30 లోపు ఎన్నికల నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. వార్డుల విభజన ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయవాది స్పందించారు. ప్రభుత్వం తరపున ఎన్నికల నిర్వహణకు 30 రోజుల సమయం కావాలని కోరారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు 60 రోజుల గడువు కావాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసిన సర్వోన్నత న్యాయస్థానం సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలను సెప్టెంబర్ లోపు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. వార్డుల విభజన, ఓటర్ జాబితాలో మార్పులు , చేర్పులు.. కొత్త ఓటర్ల నమోదు.. రిజర్వేషన్లు.. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత ఎన్నికలు జరుగుతాయని తెలుస్తోంది.. ఇక తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లో 8 స్థానాలు సాధించినప్పటికీ.. అధికార పార్టీకి ఆ ఫలితాలు అంతగా ఆనందాన్ని ఇవ్వలేదు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు ఏడాదిన్నర పరిపాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల్లో జడ్పీ చైర్మన్, ఇతర స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. మరోవైపు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కూడా అధికార పార్టీకి గట్టి పోటీ ఇస్తామని చెబుతున్నాయి.

# ప'రేషన్..!'

సిరిసిల్ల : జిల్లాలోని చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీలో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం మూడు నెలల సన్న బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో ఏ దుకాణం వద్ద చూసినా లబ్ధిదారుల రద్దీ కనిపిస్తోంది. పలుచోట్ల డీలర్లు అందుబాటులో లేకపోవడం, సర్వర్లు డౌన్ అవడం వంటి ఇక్కట్లతో ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. కొన్నిచోట్ల ప్రత్యామ్నాయ మార్గంగా వేరే దుకాణాల బాట పడుతున్నారు. ఒక్కో లబ్ధిదారుడి వేలిముద్రను తీసుకుంటుండగా పంపిణీ ప్రక్రియ ఆలస్యమవుతున్న తరుణంలో ఇటువంటి సమస్యలు తలెత్తడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంపిణీలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో దృష్టి సారించాలని కోరుతున్నారు.



**జిల్లాలో ఇలా..**
చౌకధరల దుకాణాలు : 345
జారీ చేసిన రేషన్ కార్డులు : 173578
ప్రతి నెలా పంపిణీ చేసే బియ్యం : 3,275 టన్నులు

సమస్యగా ఉంది: పాసికంటి సాయి, 23వ వార్డు, సిరిసిల్ల
మా వార్డులోని రేషన్ డీలర్ మృతిచెందడంతో దుకాణాన్ని మూసేశారు. ఇతర దుకాణాల వద్దకు వెళ్తే అక్కడ రద్దీ నెలకొంటోంది. ప్రస్తుతం మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో చాలా సమయం పడుతోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

త్వరలో ఇన్‌ఛార్జిని నియమిస్తాం: మహేశ్‌కుమార్, తహసీల్దార్, సిరిసిల్ల
సిరిసిల్ల పట్టణం 23వ వార్డులోని రేషన్ దుకాణం మూసివేత మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే పలువురు డీలర్లు తమను ఇన్‌ఛార్జిలుగా నియమించాలని విన్నవించారు. సిరిసిల్ల ఆర్డీవో దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. త్వరలో ఇన్‌ఛార్జి డీలర్‌ను నియమిస్తాం. ఇతర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

## అతివల నేస్తం.. అవగాహన విస్తృతం

పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాలో ఇద్దరు బాలికలకు తమ సమీప బంధువు మొదట్లో సామాజిక మాధ్యమంలో సందేశాలు పంపేవాడు. కొద్ది రోజుల తర్వాత బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. దీంతో బాలికలు తల్లిదండ్రులకు విషయం చెప్పారు. వారు షీ టీంను సంప్రదించగా.. నిందితుడిపై కేసు నమోదైంది. ఇలాంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో నిత్యం ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి. కొందరు బాలికలు, యువతులు ధైర్యంగా ఎదుర్కొంటుంటే.. మరికొందరు ఎవరికీ చెప్పుకోలేక ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి ఆగడాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పాఠశాల స్థాయిలోనే లైంగిక దాడులు, సైబర్ నేరాలు ఎదుర్కోవడంపై అవగాహన కల్పించేందుకు 'షీటీం' వ్యవస్థను ఏర్పాటు చేసింది. విద్యాసంస్థల్లోని బాలికల్లో చైతన్యం కల్పిస్తున్నారు. వారి ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

**వ్యసనాల బారిన పడకుండా..**
విద్యాసంస్థల్లో బాలికలు, రద్దీ ప్రాంతాల్లో మహిళలు తీసుకోవాల్సిన ఆత్మరక్షణ చర్యలపై షీ టీం బృందాలు వివరిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వాస్తవ సంఘటనలు వివరిస్తూ ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో దిశానిర్దేశం చేస్తున్నారు.
మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా నియంత్రణ, శారీరక, మానసిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలో సమావేశాల్లో వివరిస్తున్నారు. అమ్మాయిలు ఆకర్షణకు గురవకుండా మెలకువలు నేర్పిస్తున్నారు.



వ్యసనాలకు దూరంగా ఉండేందుకు భవిష్యత్తు లక్ష్యాలను చేరుకునేలా వివరిస్తున్నారు.ప్రాథమిక స్థాయిలోనే బాలికలు చట్టాలపై పట్టు సాధించేలా చొరవ తీసుకుంటున్నారు. విద్యతో మంచి జీవితం ఉంటుందని వివరిస్తున్నారు.
ఆత్మవిశ్వాసం పెంచేలా..బాలికలు, యువతులు ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొనేలా వారిలో ఆత్మవిశ్వాసం కల్పించడం.
అసభ్యకర ప్రవర్తన, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించడం.
సైబర్ నేరాల బారిన పడకుండా .జాగ్రత్తలు తీసుకోవాలో వివరించడం.
ఆపదలో ఉంటే ఎలా రక్షించుకోవాలో సలహాలివ్వడం.
దిశా నిర్దేశం చేశారు సెల్‌ఫోన్ వినియోగంపై కలిగే అనర్థాలను షీ టీం బృందం వివరించింది. ప్రస్తుతం యువత వ్యసనాలకు ఎలా బానిసవుతుందో అవగాహన కల్పించారు. ఏకగ్రాతతో చదివి ఉన్నతంగా ఎదిగేలా దిశా నిర్దేశం చేశారు.
లక్ష్మీప్రసన్న, పదో తరగతి, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల గోదావరిఖని

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా మధుర చారిటబుల్ ట్రస్ట్





ఉప్పల్ (సూర్యప్రభా)మల్కాజిరి పార్లమెంట్ పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతపూర్ డివిజన్ లో జిల్లా పరిషత్ హై స్కూల్లో మధుర చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , మల్కాజిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి హాజరైనారు. రామంతపూర్ డివిజన్ లో గల జిల్లా పరిషత్ హై స్కూల్ లో మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ %డ% చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు స్టడీ మెటీరియల్స్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పారితోషకంతో పాటు ప్లేట్లను తమ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.రాగిడి లక్ష్మారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తాను గత 26 సంవత్సరాల నుండి మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని, పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు తన వంతు సహాయంగా నోటి పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్, ప్లేట్లు, అందజేశారు. అలాగే క్రీడా సామాగ్రి మరియు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పారితోషకం విద్యార్థులకు అందచేశారు.ఆర్థికంగాపై చదువులు చదవలేని విద్యార్థిని విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు, విదేశీ చదువులు చదువుకునే వారికి ప్రోత్సాహకాలు అందిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేయడం జరిగింది అని రాగిడి లక్ష్మారెడ్డి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గంధం నాగేశ్వరరావు, జహంగీర్, బోసాని పవన్, వంజరి సంతోష్, కిట్టు, ఆనంద్ యాదవ్, రాజు, వంశీ, ఉద్యమకారులు, మధుర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ని కలిసి 26+1 బీసి కులాల అసోసియేషన్ సభ్యులు



కుత్బుల్లాపూర్ (సూర్యప్రభా)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద 26+1 ఉపకులాల అసోసియేషన్ సభ్యులు కలిశారు.. తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం బీసి జాబితా నుండి తొలగించిన 26+1 ఉప కులాలను మళ్ళీ బీసి జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి బీసీ జాబితాలో చేర్చేలా కృషి చెయ్యాలని ఆ ఉపకులాల అసోసియేషన్ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్‌ని కోరడం జరిగింది..అనంతరం కొత్తగూడెం ఎమ్మెల్యే శ్రీ కూనమనేని సాంబశివ రావు కూడ ఈ సమావేశంలో పాల్గొని గత బీఆర్ఎస్ పార్టీ చేసిన అన్యాయాన్ని కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి తో కలిసి ఈ సమస్యలు పట్ల వివరిస్తాం అన్నారు..ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 26+1 ఉప కులాలను బీసీ జాబితా నుండి తొలగించి తీవ్ర అన్యాయం చేసిందాన్నారు.. 2014 నుండి ఆ కులాల కుటుంబల విద్య, ఉపాధి, రాజకీయ రంగాలలో 11 సంవత్సరాలు కోల్పోయిన రిజర్వేషన్ బాధ్యత వహించాల్సింది ఎవరని ప్రశ్నించారు..కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో పెట్టిన ప్రకారం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీకు ఇచ్చిన మాట నిలపెడుతారని.. ఈ సమస్య పట్ల ముఖ్యమంత్రి తో కలిసి మాట్లాడి న్యాయం జరుగేలా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.. అణగారిన వర్గాల ఆపద్బాంధవుడు, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. ఇచ్చిన మాట కోసం బీసీ ప్రజల అభ్యున్నతి కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా కుల, జన గణన చేసిన మొట్టమొదటి నాయకుడు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని గుర్తుచేశారు..ఈ కార్యక్రమంలో ఉపకుల అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## పండ్ల తోటలకు ప్రోత్సాహం



మెట్‌పల్లి: పండ్ల తోటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సంప్రదాయ పంటలను సాగు చేస్తున్న అన్నదాతలను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించాలని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి పర్చాలని ఉపాధి హామీ పథకం కింద శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో రైతులతో పండ్ల తోటలు సాగు చేయించాలని గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో లక్ష్యం పెట్టుకున్నారు. అందుకనుగుణంగా ఇప్పటికే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.
ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలాల వారీగా పండ్ల తోటల పెంపకంపై జిల్లా అధికారులు లక్ష్యాన్ని కేటాయించారు. అయిదెకరాల లోపు ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులను గుర్తించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మండల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది ఆసక్తి ఉన్న రైతులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. మామిడి, నిమ్మ, నారింజ, జీడి మామిడి, జామ, సీతాఫలం, సపోటా, ఆయిల్‌పామ్, నేరేడు, ఆపిల్ బేర్, దానిమ్మ, మునగ, డ్రాగన్‌ఫ్రూట్ వంటి వాటిని తమ భూముల పరిస్థితికి అనుగుణంగా రైతులు ఎంపిక చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మొక్కలను మొదట ప్రభుత్వం ఎంపిక చేసిన నర్సరీల నుంచి తెచ్చుకోవచ్చు. ఒకవేళ అవి నచ్చుకుంటే తమకు నచ్చిన నర్సరీల నుంచి కూడా కొనుగోలు చేయవచ్చు. ఆసక్తి ఉన్న రైతులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

**నిర్వహణ ఖర్చులు సైతం..**
పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం పలు రకాలుగా ప్రోత్సాహకం అందజేయనుంది. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను తవ్వించనున్నారు. మొక్కల రవాణా, నాటడం కూడా ప్రభుత్వమే భరిస్తుంది. నాటే సమయంలో కొన్ని రకాల ఎరువులను అందజేయనున్నారు. ఆ తర్వాత మొక్కలు ఎదిగేలా నీటిని అందించేందుకు సైతం చేయూతనిస్తారు. ఇలా మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం వెచ్చించనుంది. గతంలో జిల్లాలో పలు చోట్ల ఈ పథకం కింద రైతులు పండ్ల తోటల పెంపకం చేపట్టి ఫలసాయంతో ఆదాయం పొందుతున్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

**లక్ష్యం చేరేనా!** జిల్లాలో ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో పంట్ల తోటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకు 280 మంది రైతులు 464.85 ఎకరాల్లో సాగు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. 136 మంది రైతులకు సంబంధించి 270 ఎకరాలకు అధికారులు అంచనాలు రూపొందిం చారు. ఇందులో 65 ఎకరాల్లో గుంతలు తవ్వడం ప్రారంభించారు. వర్షాలు కురిసే సమయంలో మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టనున్నారు. అంతలోపే ఆసక్తి ఉన్న రైతులను గుర్తిస్తేనే లక్ష్యం నెరవేరే అవకాశముంది.

## అధికారుల నిర్లక్ష్యం.. కాలువకు శాపం



హాలియా : నల్గొండ, సూర్యాపేట జిల్లా రైతాంగానికి వరప్రదాయిని అయిన నాగార్జునసాగర్ ఎడమకాలువ కట్టల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యమా..అధికారుల పర్యవేక్షణ లోపమా అన్నట్లుగా ఉంది. ఎడమకాలువ నిర్మాణ సమయంలో ఇరువైపులా ఎనిమిది అడుగుల వెడల్పుతో భారీగా కరకట్టలు, కట్టల కింది భాగంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా రాకపోకలు సాగించడానికి సర్వీసు రోడ్లు ఏర్పాటు చేశారు. ప్రధాన కాలువ కట్టలపై ఎక్కడ పడితే అక్కడ వ్యాపార, ఇతర వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా పడేస్తున్నారు. ఈ వ్యర్థాల కారణంగా ఎలుకలు పంది కొక్కులు రంధ్రాలు చేసి బుంగలు పడే ప్రమాదం ఉంది. గతంలో నిడమనూరు వద్ద కట్టకు బుంగ పడి సమయంలో ఎలుకల కారణంగా పడిందని అధికారులు తెలిపినట్లు సమాచారం. దీంతో సుమారు పదిహేను రోజుల వరకు కాలువలో నీటిని నిలుపుదల చేయడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రతి ఏడాది ప్రభుత్వం కట్టలపై గుంతలు పడిన చోట మట్టితో పూడ్చటం, భారీగా పెరిగిన కంప చెట్లను తొలగించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వ కాలం నుంచి నేటి వరకు కట్ట సంరక్షణ కోసం తీసుకున్న చర్యలు శూన్యమని రైతులు ఆరోపిస్తున్నారు. పంటల సమయంలో కట్టకు నష్టం వాటిల్లే ఇనుప చక్రాలతో ట్రాక్టర్లు కట్టపై తిరగడాన్ని అధికారులు అరికట్టాలని అన్నదాతలు కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రధాన కాలువ కట్టపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో కట్ట కుంగి లైనింగ్ జారే అవకాశం ఉంటుందని. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. సమస్యపై ఎన్నెస్పీ, ప్రధాన కాలువ డీఈ వెంకటయ్యను వివరణ కోరగా నాగార్జునసాగర్ ఎడమకాలువ మరమ్మతులకు రూ. 60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే టెండర్ ప్రక్రియ చేపట్టి పనులు చేపడుతామన్నారు.

## వరించని వానలు.. 'విత్తు'కోని ఆశలు

ఖమ్మం: మే నెలలో మురిపించిన వరుణుడు జూన్‌లో ముఖం చాటేశాడు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసినా.. సాగునీటి ప్రాజెక్టులు కళకళలాడేవి. ఇంకోపక్క ఎండలు దంచికొడుతుండటంతో ఉన్న నీరూ ఆవిరవుతోంది. సాగర్ జలాశయంపైనే ఖమ్మం జిల్లాలోని 2.52 లక్షల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. వైరా ప్రాజెక్టులో నీరున్నా.. ప్రణాళిక ప్రకటించకపోవడంతో కర్షకులు నిరీక్షిస్తున్నారు. ముందే నార్లు పోసుకున్న వారు చినుకు కోసం ఎదురుచూస్తున్నారు. ఉభయ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పాలేరు.. తప్పని ఎదురుచూపు
లుగరిష్ఠ నీటిమట్టం: 23 అడుగులు
ప్రస్తుతం: 13.75
ఆయకట్టు: 20 వేల ఎకరాలు (ఎన్నెస్పీ పరిధిలో 2.52 లక్షల ఎకరాలు)
సామర్థ్యం: 2.558 టీఎంసీలు
ప్రస్తుతం: 1.185
ఎగువన వర్షాలు కురవకపోవడంతో సాగర్ జలాశయానికి నీటిరాక లేదు. సాగర్ నిండితేనే పాలేరు ఆయకట్టు కళకళలాడుతుంది. సాధారణంగా ఎన్నెస్పీ పరిధిలో జులై 15 తరువాత నీటిని విడుదల చేస్తారు. ఈలోపు దుక్కులు దున్నుకొని.. నారు మడులు సిద్ధం చేసుకుంటారు. సాగర్‌కు వరద రాకపోవడంతో పాలేరు జలాశయం పరిధిలో నాట్లు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

**వైరా.. అయోమయం**
18.30 అడుగులు
14.11 20,000 ఏటా జలాశయం పరిధిలో జూన్ మూడో వారంలో నార్లు పోసుకుంటారు. జులై చివరి వారం నుంచి ఆగస్టు మొదటి వారం మధ్యలో నాట్లు వేస్తుంటారు. ప్రస్తుతం నారు పోసుకునే సీజన్ మొదలైనా.. అధికారులు సాగునీటి ప్రణాళిక విడుదల చేయలేదు. రానున్న నీటి విడుదలపై స్పష్టత లేకపోవడంతో రైతులు నార్లు పోసుకోవడానికి వెనకంజ వేస్తున్నారు. బోర్లు ఉన్నవారు మాత్రం ఇప్పటికే నార్లు పోసుకొని నీటి రాక కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఎగువ నుంచి వరద రాకపోవడంతో రోజురోజుకూ నీటిమట్టం గణనీయంగా తగ్గుతోంది.
పెద్దవాగుకు గండి బెంగ
6.10 మీటర్లు
డెడ్‌స్టోరేజీ (87.411 ఎంసీఎఫ్‌టీ)
ఆయకట్టు: 16 వేల ఎకరాలు (తెలంగాణలో నాలుగు వేలు)
గతేడాది జులై 18న వచ్చిన వరదలకు పెద్దవాగు కట్టకు పెద్దగండి పడింది. నాలుగు చోట్ల ధ్వంసమైంది. మరోచోట కోతకు గురైంది. రూ.3.5 కోట్లతో తాత్కాలికంగా రింగ్‌బండ్(అడ్డుకట్ట) కట్టారు. పూర్తి స్థాయి మరమ్మతులకు రూ.92 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన జీఆర్ఎంబీ(గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) సమావేశంలో రూ.19 కోట్లు ఇవ్వడానికి ఏపీ నీటిపారుదలశాఖ అధికారులు అంగీకరించారు. నేటికీ ఒక్క పైసా విదల్చకపోవటంతో మరమ్మతులు అటకెక్కాయి. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే రింగ్‌బండ్ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురవకపోవడంతో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు నార్లు పోసుకోవడానికి నిరీక్షిస్తున్నారు.
తాలిపేరు.. లేదు చుక్కనీరు
74 మీటర్లు డెడ్‌స్టోరేజీజి
24,760 ఎకరాలు రాష్ట్రంలో ముందుకు వరి నాట్లు ప్రారంభమయ్యే ఆయకట్టు ఇది. ఛత్తీస్‌గఢ్‌లో వర్షాలు కురవకపోవడంతో నీటిరాక తగ్గింది. ప్రాజెక్టు పరిధిలో బోర్ల ఆధారంగా రైతులు అక్కడక్కడా నార్లు పోసుకున్నారు. సాధారణంగా జూన్ మొదటి వారంలో నార్లు పోసుకొని, జులై మొదటి వారంలో నాట్లు వేస్తుంటారు. ప్రసుత వర్షాభావ పరిస్థితులతో ఆలోచిస్తున్నారు. ఈ సంవత్సరం నాట్లు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

## పేరుకే తెలంగాణ తిరుపతి.. ఏపీ బస్సులే గతి

మధిర : ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి తెలంగాణ తిరుపతి అన్న పేరుంది. కానీ పుణ్యక్షేత్రానికి ఆంధ్రప్రదేశ్ బస్సులు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. రవాణా సదుపాయం లేకపోవటంతో ఉభయ జిల్లాల్లోని భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండో అతిపెద్ద దేవాలయానికి బస్సు సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.
శ్రీవారి ఆలయానికి మధిరతోపాటు ఖమ్మం, భద్రాచలం, సత్తుపల్లి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఆయా డిపోల నుంచి బస్సు సదుపాయం లేకపోవటంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఖమ్మం డిపో బస్సులు జమలాపురం వచ్చి ఖమ్మం మీదుగా హైదరాబాద్ వెళ్లేవి. అలాగే భద్రాచలం డిపో వాహనాలు ఆలయానికి వచ్చి వెళ్లేవి. నేడు ఆ సర్వీసులు ఒక్కటీ లేవు.ఖమ్మం పరిసర ప్రాంత వాసులు కొందరు వ్యక్తిగత వాహనాల్లో శ్రీవారి వద్దకు వస్తుండగా ఇంకొందరు ఎర్రుపాలెం వరకు రైలు మార్గంలో వచ్చి ఆటోలను ఆశ్రయిస్తున్నారు.
జమలాపురం నుంచి మధిర మీదుగా భద్రాచలం వరకు ఏర్పాటు చేసిన సర్వీసును పది రోజులకే ప్రయాణికులు ఉండటం లేదని



నిలిపివేశారు. ఖమ్మం నుంచి మధిర మీదుగా జమలాపురం వరకు, భద్రాచలం నుంచి నెమలి మీదుగా జమలాపురానికి బస్సు లు నడిపితే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.
'మధిర, ఖమ్మం డిపోల నుంచి బస్సు సర్వీస్‌లు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఏపీకి చెందిన చెందిన సర్వీస్‌లను నడుపుతున్నారు. సమస్యపై ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు విన్నవించాం.' ఉప్పల శ్రీనివాస్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు
'జమలాపురం ఆలయానికి బస్సు సర్వీస్‌లు ఏర్పాటు చేశాం. ఆదాయం అంతగా లేకపోవటంతో నిలిపివేశాం. భక్తులు ఆర్టీసీని ఆదరిస్తే ఎన్ని సర్వీసులైనా ఏర్పాటు చేస్తాం. '
శంకర్‌రావు, డిపో మేనేజర్



# ప్రజాస్వామ్యానికి చీకటియుగం 'ఎమర్జెన్సీ'.. కేంద్ర క్యాబినెట్

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గంపలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఎమర్జెన్సీ బాధితులకు నివాళిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన క్యాబినెట్.. అత్యవసర పరిస్థితి (%జుఎవలీన్రవఅ౦%)కి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించింది. శుభాంశు శుక్లాతో కూడిన మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ చేసిన మరో తీర్మానానికి ఆమోదం తెలిపిన మంత్రివర్గం పుణె, ఆగ్రాలో పలు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ (%జుక్ష%)లో భాగంగా రూ.111.5 కోట్లతో దక్షిణాసియా ప్రాంతీయ పరిశోధనా కేంద్రాన్ని ఆగ్రాలో ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పుణె మెట్రో రైలు విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,626 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఝరియాలోని ఝరియా బొగ్గు గనుల నిర్వాసితుల పునరావాసానికి (ఝరియా మాస్టర్ ప్లాన్) రూ.5,940 కోట్లు కేటాయించింది. నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం కోసం నైపుణ్య శిక్షణ, స్థిరమైన జీవనోపాధి మార్గాలు చూపడం వంటివి ఇందులో ఉన్నాయి.

శుభాంశు శుక్లాతో కూడిన వ్యోమగాముల బృందం విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ చేసిన తీర్మానానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 140కోట్ల భారతీయుల ఆశయాలను ఆయన మోసుకెళ్లారని, ఈ సందర్భంగా శుభాంశుతోపాటు ఇతర వ్యోమగాములకు అభినందనలు తెలిపింది. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన బాధితులకు సంఘీభావంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన క్యాబినెట్.. వారి త్యాగాలను గౌరవించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. ఈ ఏడాదితో సంవిధాన్ హత్యా దివాస్‌కు 50ఏళ్లు పూర్తైందని పేర్కొంది.




# మోదీ.. ది ఎమర్జెన్సీ డైరీస్

ఢిల్లీ: దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి నేటితో 50 ఏళ్లు పూర్తవుతోంది. ఈసందర్భంగా ఆ నాటి రోజులను గుర్తుచేసుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. గత కాంగ్రెస్ పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నాటి దురాగతాలను భారతీయులెవరూ ఎన్నటికీ మర్చిపోలేరని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఎమర్జెన్సీ రోజుల్లో తన ప్రయాణాన్ని వివరించే ఓ పుస్తకం రానున్నట్లు ప్రధాని ప్రకటించారు. 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో ఈ పుస్తకాన్ని తీసుకొస్తున్నారు. "ఎమర్జెన్సీ విధించిన సమయంలో నేను ఆర్‌ఎస్‌ఎస్‌లో యువ ప్రచారక్‌గా పనిచేస్తున్నా. అత్యయిక స్థితికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం.. నాకు ఎన్నో పాఠాలు నేర్పించింది. అనుభవాలను మిగిల్చింది. మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ఈ ఉద్యమం పునరుద్ఘాటించింది. అదే సమయంలో ఎంతోమంది రాజకీయ ప్రముఖుల నుంచి నేర్చుకునే అవకాశం కల్పించింది. ఆ అనుభవాల్లో కొన్నింటిని సమీకరించి 'బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్' పుస్తక రూపంలో తీసుకొస్తోంది. 'ది ఎమర్జెన్సీ డైరీస్'.. అత్యయిక స్థితి నాటి రోజుల్లో నా ప్రయాణాన్ని వివరిస్తుంది. ఎన్నో జ్ఞాపకాలను గుర్తుచేస్తుంది" అని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ పుస్తకానికి మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ ముందుమాట రాశారు. దీన్ని బుధవారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా విడుదల చేయనున్నారు.

**జాతి గుండెలపై చెరగని గాయం ప్రజాస్వామ్యాన్ని నిర్బంధించి..**

ఈసందర్భంగా ఎమర్జెన్సీకి కారణమైన నాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రధాని విమర్శలు గుప్పించారు. "దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిన ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు పూర్తయ్యాయి. దీన్ని 'సంవిధాన్ హత్య దివస్'గా నేడు ప్రజలు గుర్తుంచుకోనున్నారు. యాభై ఏళ్ల క్రితం ఇదే రోజున భారత రాజ్యాంగ విలువలను పక్కన బెట్టి, ప్రాథమిక హక్కులను అణచివేసి, పత్రికా స్వేచ్ఛను కాలరాసి.. ఎంతోమంది రాజకీయ నేతలు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, సామాన్య పౌరులను జైలుకు పంపించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నిర్బంధానికి గురిచేసింది. రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘించి వారు ప్రవర్తించిన తీరును భారతీయులెవరూ ఎన్నటికీ మర్చిపోలేరు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రతి ఒక్కరికీ మేం సెల్యూట్ చేస్తున్నాం. రాజ్యాంగ విధానాలను మరింత బలోపేతం చేసి వికసిత్ భారత్‌ను నిర్మించేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేస్తూ కొత్త శిఖరాలను అధిరోహిస్తాం" అని మోదీ రాసుకొచ్చారు.



# మూడు నెలల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

హైదరాబాద్: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి ఇవాళ తీర్పు వెలువరించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవిదేవి ఇవాళ తీర్పు ఇచ్చారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. "గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి" అని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ..రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

# ఆ భూముల పరిష్కారానికి జోక్యం చేసుకోండి.. కేంద్రమంత్రికి శ్రీధర్ వినతి



న్యూఢిల్లీ, జూన్ 25: దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బిజీబిజీగా ఉన్నారు. ఈరోజు (బుధవారం) కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామితో మంత్రి సమావేశమయ్యారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిన భూముల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కుమారస్వామిని మంత్రి కోరారు. 1960లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం హైదరాబాద్ చుట్టుపక్కల విలువైన భూములను భారీ ఎత్తున రాయితీ ధరలకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో అనేకం మూతపడ్డాయని.. కొన్ని ఉత్పత్తులను నిలిపివేశాయని.. ఆ భూములన్నీ ఇప్పుడు నిరుపయోగంగా ఉన్నాయంటూ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని కేంద్ర రంగ సంస్థలు తమ భూములను వాణిజ్య పరంగా వినియోగానికి మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కేంద్ర రంగ సంస్థలకు ఇచ్చిన భూముల విషయంలో ఉపయోగంలో లేకుండా ఉండటం, పెట్టుబడులు ఉపసంహరించుకుంటూ ఎటువంటి ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేకపోవడం వల్ల రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారిందని తెలిపారు. సరైన పరిహారం లేకుండానే భూములను ప్రైవేట్ కంపెనీలకు బదిలీ చేయడం వల్ల రాష్ట్రానికి నష్టమే తప్ప ప్రయోజనం లేదని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. భూముల విషయంలో రాష్ట్రాలకు మేలు కలిగేలా మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రమంత్రి కుమారస్వామికి మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. **కేంద్రప్రభుత్వ రంగ సంస్థలు ఇవే...** 1. హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్, మేడ్చల్-మల్కాజిగిరి - 324.87 ఎకరాలు 2. హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్, సంగారెడ్డి - 126.33 ఎకరాలు 3. ఐడీపీఎల్, మేడ్చల్-మల్కాజిగిరి - 551.03 ఎకరాలు 4. హెచ్‌ఎంటీ, మేడ్చల్-మల్కాజిగిరి - 888.05 ఎకరాలు 5. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), ఆదిలాబాద్ - 2,272.85 ఎకరాలు 6. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, ఎద్దుమైలారం, సంగారెడ్డి - 3,020 ఎకరాలు

# తెలంగాణలో మూడ్రోజులపాటు వర్షాలు.. ఐదు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్: వాయువ్య బంగాళఖాతంలో రాగల 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో తెలంగాణలో రానున్న మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది.

ఇవాళ (బుధవారం) కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.

ఆయా జిల్లాలకు జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# రేవంత్‌రెడ్డి నీ ఛాలెంజ్‌ని స్వీకరిస్తా.. హరీష్‌రావు ప్రతి సవాల్



సిద్దిపేట: బనకచర్ల ప్రాజెక్ట్ గురించి కాంగ్రెస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి 18 నెలల పాలన చూశాక కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో ప్రజలకు అర్థమైందని చెప్పారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి, కావాలని ప్రజలు అంటున్నారని తెలిపారు. మళ్లీ పదేళ్ల దాకా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా రేవంత్‌రెడ్డి చేశారని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు మాజీ మంత్రి హరీష్‌రావు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే నిర్వహించడం లేదని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ఇవాళ(బుధవారం) సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రశాంత్ పాటిల్‌కి హరీష్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరీష్‌రావు వెంట ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీఆర్‌ఎస్ శ్రేణులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అబద్ధాల్లో సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు పోదామని అంటున్నారని.. ఎక్కడికి రమ్మంటారో చెప్పాలని.. తాను సిద్ధమని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రతి సవాల్ విసిరారు. ఏ టీవీలో కూర్చుందామో, ఎక్కడ మాట్లాడుదామో చెప్పు తాను రెడీ... రేవంత్‌రెడ్డి వస్తారో, మహేష్ కుమార్ గౌడ్ వస్తారో చెప్పాలని ప్రతి సవాల్ చేశారు. అసెంబ్లీ నిర్వహించడం చేతగాక రేవంత్‌రెడ్డి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. వారం రోజులకు మించి అసెంబ్లీ నడిపే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. మళ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు పూర్తిగా అధికారంలో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ఈ ఎన్నికల కోసం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. అందరం కలసి ఐక్యతతో ముందుకు పోతేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు సాధ్యమని హరీష్‌రావు పేర్కొన్నారు.

# భారాస సోషల్ మీడియా ప్రచారం ప్రజలు నమ్మొద్దు: మహేశ కుమార్‌గౌడ్



హైదరాబాద్: భారాస సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్ హయాంలో జరిగిన సామాజికన్యాయం ఏ ప్రభుత్వంలోనూ జరగదు. గత ప్రభుత్వం ఎన్నికల కోసమే పథకాలు తెచ్చేది. హుజూరాబాద్ ఎన్నిక కోసమే దళితబంధు తీసుకొచ్చారు. భారాస పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని.. కాంగ్రెస్ 18 నెలల్లో చేసింది. అభూత కల్పనలతో సోషల్ మీడియాలో భారాస ప్రచారం చేస్తోంది. రాష్ట్రంలో పరిపాలన అద్భుతంగా జరుగుతోంది.

పదేళ్ల భారాస పాలన తర్వాత వాళ్ల పరిస్థితి ఏంటో ప్రజలకు తెలుసు. రాష్ట్ర అవసరాలను, హక్కులను గత ప్రభుత్వం తాకట్టుపెట్టింది. గోదావరి-బనకచర్లపై లోతుగా అధ్యయనం చేసి నిర్ణయం ప్రకటిస్తాం" అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేయించాలి: ఎంపీ డీకే అరుణ



నల్లగొండ: స్థానిక సంస్థలకు వెళ్లే ధైర్యం కాంగ్రెస్‌కి లేదని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. రెండు ఎకరాలు ఉన్నవారికి కూడా రైతు భరోసా ఇంకా రాలేదని.. అలాంటప్పుడు రైతు భరోసా పేరుతో సంబురాలు ఎందుకు చేసుకుంటున్నారో కాంగ్రెస్ నేతలకే తెలియదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో బీజేపీ నాయకులందరూ బాధితులేనని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ప్రభుత్వం ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని నిలదీశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేయించాలని కోరారు. ఇవాళ(బుధవారం) నల్లగొండలో ఎంపీ డీకే అరుణ పర్యటించారు. బీజేపీ నేతలతో పార్టీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. జూన్ 25వ తేదీ దేశ చరిత్రలో చీకటి రోజని తెలిపారు ఎంపీ డీకే అరుణ. ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ చేసిన అరాచకాల గురించి ప్రజలందరికీ తెలియాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆనాడు పేదలపై అరాచకాలు చేశారని.. ఈనాడు సామాజిక న్యాయం అంటూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ తన అజెండాను దేశంపై రుద్దేందుకు రాజ్యాంగ సవరణలు చేపట్టిందని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిన కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రపంచ వ్యాప్తంగా లభిస్తోన్న ఖ్యాతిని చూసి రాహుల్ గాంధీ ఓర్వలేక పోతున్నారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత శక్తి ఏంటో పాకిస్థాన్‌కి చూపించామని తెలిపారు. ప్రధానిని విమర్శించే సీఎం రేవంత్‌రెడ్డి ఎమర్జెన్సీ గురించి ముందుగా మాట్లాడాలని ఎంపీ డీకే అరుణ హితవు పలికారు.

# సింహవాహిని టెంపుల్‌కు డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ : తెలంగాణ బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఆషాడ మాస బోనాల పండుగకు హైదరాబాద్ సిటీలోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. బోనాల సందర్భంగా వివిధ ఆలయాల్లో సీఎం రేవంత్?తో పాటు మంత్రులు, ముఖ్యనేతలు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో ఏ ఆలయంలో ఎవరు పట్టువస్త్రాలు సమర్పిస్తారనే వివరాలను దేవాదాయశాఖ మంగళవారం వెల్లడించింది. వచ్చే నెల 13న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో నిర్వహించే బోనాల ఉత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. 20న లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని అధికారులు తెలిపారు.



# ఉజ్జయిని మహంకాళి బోనాలకు సీఎం

## మర్డర్ చేసి ఫారిన్ వెళ్లాలని సెట్ చేసుకున్నారట

సాదాసీదా మనుషులు కరుడుగట్టిన నేరస్తుల మాదిరి ప్లానింగ్ చేయటం.. వెనుకా ముందు చూసుకోకుండా కర్కశంగా హత్యలు చేయటం.. ఆ నేరం నుంచి శిక్ష పడకుండా తప్పించుకోవటం కోసం చేసే ప్లానింగ్ చూసినప్పుడు.. మరీ ఇంత ముదురు ఆలోచనలా? అంటూ హడలిపోవటం ఖాయం. సంచలనంగా మారిన తేజేశ్వర్ హత్య ఉదంతంలో కొత్త నిజాలు వెలుగు చూసి షాకిస్తున్నాయి. వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని.. ధనవంతుడైన తేజేశ్వర్ ను పెళ్లాడి.. అతడి డబ్బును కొల్లగొట్టి.. ఆపై హత్య చేసి పారిపోవాలనుకున్న ప్లాన్ బెడిసి కొట్టి జైలుపాలైన సంగతి తెలిసిందే. తేజేశ్వర్ హత్య కేసును విచారిస్తున్న పోలీసులు సైతం నివ్వెర పోయే నిజాలు తాజాగా వెలుగు చూశాయి. తేజేశ్వర్ ను చంపిన తర్వాత తిరుమలరావు.. ఐశ్వర్య కలిసి తొలుత లద్దాఖ్ కు వెళ్లి.. అక్కడి నుంచి విదేశాలకు పారిపోయేందుకు ప్లాన్ చేసుకున్నారు. ఇందుకోసం రెండు విమాన టికెట్లు బుక్ చేసుకోవటంతో పాటు.. రూ.20 లక్షలు



సమకూర్చుకున్నారు. తాము సిద్ధం చేసుకున్న డబ్బుల్లో నుంచే రూ.2 లక్షల మొత్తాన్ని సుపారీ గ్యాంగ్ కు ఇచ్చారు. హత్య అనంతరం.. ఆ విషయం బయటకు రావటానికి ముందే విదేశాలకు పారిపోవాలని భావించారు. అయితే.. తేజేశ్వర్ కనిపించకపోవటంతో.. అతడి సోదరుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయటం.. వదిన ఐశ్వర్యపై అనుమానం వ్యక్తం చేయటంతో పోలీసులు స్పందించారు. ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. తిరుమలరావు ఒక్కడే పారిపోయేందుకు ప్రయత్నించగా..అతడ్ని శంషాబాద్ ఎయిర్ పోర్టుకు సమీపంలో అదుపులోకి తీసుకోవటంతో.. అతడి ప్లాన్ బెడిసి కొట్టింది. అయితే.. అతడ్ని అదుపులోకి తీసుకున్నట్లుగా పోలీసులు ఇప్పటివరకు ప్రకటించలేదు. విశ్వసనీ సమాచారం ప్రకారం.. బ్యాంకులో పని చేసే తిరుమల రావు తొలుత తన మొదటి భార్యను చంపేసి.. ఆ తర్వాత ఐశ్వర్యను పెళ్లాడాలని భావించాడు.అయితే.. ఐశ్వర్యకు డబ్బులున్న వ్యక్తి సంబంధంరావటంతో.. అతడ్ని పెళ్లాడి..అతడి డబ్బుల్ని తీసుకొని చంపేద్దామని ప్లాన్ చేశారు. బ్యాంక్ లో పని చేసే తిరుమలరావు తన విధుల నిర్వహణలోనూ అవకతవకలకు పాల్పడతారన్న ప్రచారం జరుగుతోంది. మొత్తంగా చూస్తే.. అత్యాశకు పోవటం.. అంతమొందించే ప్లాన్లు వేసి పోలీసుల కళ్లు గప్పి పారిపోవటటం ఇప్పుడున్న పరిస్థితుల్లో అసాధ్యమన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది.

## బీజేపీ తీర్థం పుచ్చుకోనున్న మీనా.. ఈసారి పక్కానా?



సినీ నటి మీనా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వనున్నారా? ఆమె భారతీయ జనతాపార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారా? అన్నదిప్పుడు తాజా చర్చగా మారింది. నిజానికి మీనా బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారంటూ గత ఏడాది మొదట్లోనూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కట్ చేస్తే.. మళ్లీ ఇప్పుడు కూడా ఇదే చర్చ మొదలైంది. దీనికి కారణం లేకపోలేదు. తాజాగా ఆమె ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ కడ్ ను కలిశారు. ఆయన్ను కలిసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఒకప్పుడు తెలుగు.. తమిళ సినీ రంగంలో అగ్రనటిగా వెలుగొందిన మీనా వ్యక్తిగత జీవితంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త 2022లో అనారోగ్యంతో మరణించారు. అప్పటినుంచి ఆమె ఒంటరిగానే ఉన్నారు. మీనా కుమార్తె నైనిక ఇటీవల అగ్రహీరో విజయ్ నటించిన మూవీలో యాక్ట్ చేయటం తెలిసిందే. ఈ మధ్యన దేశ రాజధాని ఢిల్లీ వెళ్లిన మీనా.. అక్కడ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ను కలిశారు. వీరి భేటీకి సంబంధించిన ఫోటోలు బయటకురావటంతో మీనా బీజేపీలోకి చేరేందుకు ఆసక్తిని చూపుతున్నట్లు వార్తల జోరు పెరిగింది. అయితే.. ఆమె గతాన్ని చూస్తే.. గత ఏడాది (2024) జనవరిలో ఆమె ఢిల్లీకి వెళ్లారు.అక్కడ జరిగే కార్యక్రమానికి అటెండ్ అయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరయ్యారు. గత ఏడాది కేంద్రమంత్రి మురుగన్ పొంగల్ వేడుకల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మీనాకు ఇన్విటేషన్ ఉండటం.. ఆమె ఆ ప్రోగ్రాంకు హాజరుకావటం అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అయితే.. ఆమె మౌనంగా ఉండిపోయారు. తాజాగా మాత్రం ఉప రాష్ట్రపతితో ఆమె భేటీ.. రాజకీయాల్లోకి రావటానికి ముందే పక్కా గ్రౌండ్ వర్కు చేసేందుకు వీలుగా ఆమె ప్లానింగ్ ఉందా? అన్నది ప్రశ్నగా మారింది. తమిళనాడు రాజకీయాల్లో స్పేస్ ఉండటం.. కొత్త నాయకత్వం దిశగా అడుగులు వేసి.. అధికారాన్ని సొంతం చేసుకోవాలంటే ఇదే సరైన సమయంగా చెబుతున్నారు. ఎందుకంటే.. మరికొద్ది నెలల్లో తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. విపక్ష అన్నాడీఎంకేతో కలిసి బీజేపీతో పొత్తు ఖాయం చేసుకున్నారు. యువ నటుడు విజయ్ తో కలిసి ఒక ఈ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడే ఆలోచనలు జోరుగా తాగుతున్నాయి. మరోవైపుఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం బీజేపీ నేతలు నిర్వహించే కార్యక్రమానికి పవన్ కల్యాణ్ హాజరు కావటం.. తన ప్రసంగంతో ఆకట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీకి మరింత సినీ గ్లామర్ ను జోడించటం ద్వారా ఈసారి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువు తీరేలా కమలనాథులు ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగ్గట్లే సినీ నటి మీనాను పొలిటికల్ ఎంట్రీ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.

## డజను పెళ్లిళ్లు అబద్ధం..
## పోలీసులు ముందుకొచ్చిన నీలిమ!

కోనసీమ జిల్లాకు చెందిన ఓ యువతి.. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా డజను పెళ్లిళ్లు చేసుకుందని.. ఈ నేపథ్యంలో బాధితులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని.. ఈమె అత్యంత పకడ్బందీగా పక్కాగా ప్లాన్ చేసి మరీ విడాకులు పొంది, ఆర్థికంగా స్థితిమంతులైన మగవారిని టార్గెట్ చేసుకుని, పెళ్లి చేసుకుంటుందని ప్రధాన మీడియాలో కథనాలొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. రామచంద్రాపురం గ్రామానికి చెందిన బేతి వీర దుర్గా నీలిమ అనే యువతి.. తన తల్లి, మరో ఇద్దరి సహకారంతో విడాకులు తీసుకుని డిప్రషన్ లో ఉన్న పురుషులను ఎంచుకుని, వివాహం చేసుకుంటుందని.. కొంత కాలం తరువాత అందినంత సొమ్ము లాగేస్తుందని కథనాలొచ్చాయి. ఈ క్రమంలో సుమారు 12 పెళ్లిళ్లు చేసుకున్నట్లు కథనాలొచ్చాయి. అయితే అదంతా అబద్ధం అంటూ నీలిమ మీడియా ముందుకు వచ్చారు. అవును...




తనపై "నిత్య పెళ్లి కూతురు, 12 పెళ్లిళ్లు చేసుకుంది" అంటూ జరుగుతున్న ప్రచారంపై నీలిమ అనే యువతి మీడియా ముందుకు వచ్చారు. ఈ ఒదర్భంగా... తనపై జరుగుతున్న ప్రచారం అంతా అబద్ధమని తెలిపారు. ఈ సందర్భంగా తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను అరికట్టాలని కోరుతూ రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు ఎవరి నుంచి సహాయం దొరకలేదని వాపోయారు. ఇప్పటికే కొంతకాలంగా తన జీవితాన్ని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించిన నీలిమ... న్యాయం కోసం పలువురు రాజకీయ నాయకులను ఆశ్రయించినా ఫలితం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన పరువు, గౌరవాన్ని కాపాడుకోవడానికి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. తప్పుడు ప్రచారాలు, అసత్య ఆరోపణలతో వెనక్కి తగ్గే మనిషిని కాదని చెప్పుకొచ్చారు. తనపై చేసిన ఆరోపణలు నిజం కాకపోయినా వాటి వల్ల తనకు తీవ్రంగా నష్టం జరిగిందని.. ఎవరు ఇలా చేస్తున్నారో, ఎందుకు చేస్తున్నారు అనేది త్వరలో బయట పడుతుందని.. అప్పటి వరకు తన పోరాటం ఆగదని ఆమె తెలిపారు. తనకు 12 పెళ్లిళ్లు అయ్యాయి అంటున్నవారు వాటిని సాక్ష్యాధారాలతో సహా నిరూపించాలని ఆమె కోరారు!

### సినిమా 'షో'

## తగ్గింది రెమ్యూనరేషనే.. ఛాన్సులు కాదు

ఇండస్ట్రీలో ఒక్కోసారి ఒక్కొక్కరి టైమ్ నడుస్తూ ఉంటుంది. కొన్నిసార్లు కొందరు లైమ్ లైట్ లో ఉంటే, ఇంకొన్ని సార్లు వేరే కొందరు లైమ్ లైట్ లో ఉంటారు. ప్రస్తుతం నేషనల్ క్రష్ రష్మిక అలాంటి లైమ్ లైట్ లోనే ఉంది. భాషతో సంబంధం లేకుండా ప్రతీ ఇండస్ట్రీలోనూ సినిమాలు చేస్తూ కెరీర్ ను ముందుకు తీసుకెళ్తూ వార్తల్లో నిలుస్తూ ఉంది రష్మిక . అయితే రష్మిక కేవలం తన సినిమాల విషయాల్లోనే కాదు, మరికొన్ని విషయాల్లో కూడా వార్తల్లో నిలుస్తోంది. మరీ ముఖ్యంగా ఈ మధ్య రష్మిక రెమ్యూనరేషన్ గురించి సోషల్ మీడియాలో ఎక్కువ వార్తలు వినిపిస్తున్నాయి. పుష్ప2 సినిమా కోసం రూ.10 కోట్లు ఛార్జ్ చేసిన రష్మిక రీసెంట్ గా చేస్తున్న సినిమాలకు తన పారితోషికాన్ని చాలా తక్కువ చేసింది. ఛావా సినిమా కోసం రష్మిక రూ.4 కోట్లు తీసుకుంటే, తర్వాత సల్మాన్ ఖాన్ తో కలిసి చేసిన సికందర్ సినిమాకు రూ.5 కోట్లు ఛార్జ్ చేసింది. ఇక తాజాగా వచ్చిన కుబేరా సినిమాకు రష్మికకు నిర్మాతలు రూ. 4 కోట్లు మాత్రమే



చెల్లించారట. అంటే పుష్ప2 రెమ్యూనరేషన్ తో పోలిస్తే ఇప్పుడు కుబేరాకు రష్మిక పారితోషికం సుమారు 60% తగ్గింది. ఈ వార్త ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే రెమ్యూనరేషన్ తగ్గినప్పటికీ రష్మికకు ఆఫర్లు మాత్రం ఏం తగ్గడం లేదు. రష్మిక ప్రస్తుతం థామా, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాల్లో నటిస్తోంది. ఈ రెండు సినిమాలూ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. రెమ్యూనరేషన్ తగ్గిందని రష్మికకు కెరీర్లో బెస్ట్ రోల్స్ రావడం మాత్రం ఆగలేదు.అయితే రష్మిక విషయంలో ఈ రెమ్యూనరేషన్ అనేది పెద్ద సమస్యే కాదని అర్థమవుతుంది. రెమ్యూనరేషన్ తో సంబంధం లేకుండా రష్మిక మాత్రం ప్రస్తుతం పలు పాన్ ఇండియన్ సినిమాల్లో బిజీగా ఉంది. రెమ్యూనరేషన్ అనేది సినిమా సినిమాకీ మారే అవకాశముంది. కానీ రష్మిక మాత్రం నిరంతరం ఎంతో యాక్టివ్ గా ఉంటూ పలు పెద్ద ప్రాజెక్టుల్లో నటిస్తూ ఎంతో బిజీగా ఉంది.

## హరి హర వీర మల్లు.. మరో సర్ ప్రైజ్ ఏంటంటే..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మకమైన సినిమా హరి హర వీర మల్లు ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని చివరికి జూలై 24న విడుదలకు రెడీ అవుతోంది. అనేక వాయిదాల తర్వాత ఎట్టకేలకు ఈ సినిమా థియేటర్లలోకి వచ్చేలా సన్నాహాలు జరుపుకుంటోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ సినిమాపై మళ్లీ హైప్ పెంచేందుకు కీలకమైన అంశం ట్రైలర్ కావడం విశేషం. లేటెస్ట్ సమాచారం ప్రకారం, జ్యోతి కృష్ణ నేతృత్వంలో టెక్నికల్ టీం కొత్త ట్రైలర్ రూపకల్పనలో నిమగ్నమై ఉంది. వీఎఫ్ఎక్స్ పనులు చివరి దశలో ఉండటంతో, దానిని బట్టి కొత్త ట్రైలర్ కట్ చేస్తున్నారు. ఈ ట్రైలర్ మెయిన్‌గా బజ్ క్రియేట్ చేయడమే కాకుండా, సినిమా థియేట్రికల్ బిజినెస్ పూర్తయ్యేలా చేస్తుందని అంచనా. ట్రైలర్‌ను జూలై మొదటి వారం రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌ను కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. పవన్ అభిమానులంతా ఈ ట్రైలర్ కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. హిస్టారికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు బాహుబలి ఫేం ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పోస్టర్స్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో ట్రైలర్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రాన్ని మొదటగా క్రిష్ డైరెక్ట్ చేయగా, చాలా భాగాన్ని పూర్తి చేసిన తర్వాత ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. తరువాత దర్శకత్వ బాధ్యతలు జ్యోతి కృష్ణ తీసుకున్నారు. అయినప్పటికీ మేకింగ్ విధానంలో ఎలాంటి మార్పు రాలేదని పర్ఫెక్ట్ అవుట్ పుట్ వచ్చినట్లు మేకర్స్ చెబుతున్నారు. పవన్ కల్యాణ్ అద్భుతమైన పాత్రలో నటిస్తుండగా, బాబీ డియోల్ విలన్‌గా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఏఎం రత్నం ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

ఇప్పటికే సినిమా ఓ వాయిదా తర్వాత మరోసారి వాయిదా పడటంతో అభిమానుల్లో నిరాశ నెలకొన్నా.. ఇప్పుడు ట్రైలర్ డేట్ ఫిక్స్ కావడం, విడుదల తేదీ ఖరారు కావడం మరలా హైప్‌ను రీసెట్ చేసింది. జూలై 24న థియేటర్లలోకి రాబోతున్న హరి హర వీర మల్లు, ట్రైలర్ ద్వారా ఎంత హంగామా చేస్తుందో చూడాలి. అలాగే పవన్ పవర్‌తో ఈసారి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు క్రియేట్ అవుతాయో చూడాలి.

## పెళ్లయ్యాక అవకాశాలే కరువయ్యాయి

అదితి రావు హైదరి పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు. సమ్మోహనం, చెలియా లాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు కూడా బాగానే దగ్గరైంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తున్న అదితి రావు హైదరి కెరీర్లో ప్రస్తుతం సినీ ఆఫర్లు కరువయ్యాయి. ఒకప్పుడు వరుస సినిమాలతో బిజీగా ఉన్న అదితి ఇప్పుడు చేతిలో పెద్దగా ఆఫర్లు లేక ఖాళీగా ఉంటోంది. గత కొన్నేళ్లుగా సినీ హీరో సిద్ధార్థ్ తో ప్రేమాయణంను నడిపించిన అదితి, గతేడాది అతన్ని పెళ్లి చేసుకుని మరోసారి పెళ్లి జీవితంలోకి ఎంటరైంది. సిద్ధార్థ్ ను పెళ్లి చేసుకున్న తర్వాత తన కెరీర్ ఎలా ఉందనే విషయాన్ని అదితి వెల్లడించింది. రీసెంట్ గా జరిగిన ఓ ఇంటరాక్షన్ లో భాగంగా అదితి తన కెరీర్ గురించి మాట్లాడి హాట్ టాపిక్ గా మారింది. తనకు పెళ్లయ్యాక



పెద్దగా ఆఫర్లు రాలేదని, పర్సనల్ లైఫ్ లో పెళ్లి, పిల్లలు లాంటి మైల్ స్టోన్స్ తర్వాత హీరోయిన్లు రెగ్యులర్ గా ఎదుర్కొంటున్న ఛాలెంజెస్ గురించి అదితి మాట్లాడింది. అదితికి అందానికి అందం, టాలెంట్ కు టాలెంట్, భారీ సంఖ్యలో ఫ్యాన్స్ ఉన్నప్పటికీ పెళ్లి తర్వాత తనకు ఆఫర్లు రాకపోవడమేంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. అయితే అదితి అవకాశాలపై మాట్లాడటం ఇదేం మొదటిసారి కాదు, గతంలో కూడా ఓ సారి అదితి ఈ విషయంపై మాట్లాడింది. కాకపోతే అప్పుడు హీరామండి సినిమాలో తన పాత్రకు వచ్చిన గుర్తింపు చూశాక వరుస అవకాశాలు క్యూ కడతాయనుకుంటే అసలు ఆఫర్లే కరువయ్యాయని కామెంట్ చేసింది. ఇప్పుడు పెళ్లయ్యాక ఆఫర్లు రావడం లేదంటోంది. ఏదేమైనా ఈ విషయంలో అదితి మాట్లాడిన తర్వాత ఇండస్ట్రీలో పెళ్లయ్యాక హీరోయిన్లను చూసే విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417